క్లుప్తంగా

నేడు పిడుగురాళ్లలో ఏపీకి జగనే ఎందుకు కావాలి

పిడుగురాళ్ల: పట్టణంలోని 13వ సచివాలయం పరిధిలోని 23, 24, 26 వార్డుల పరిధిలో ఎల్‌ఐసీ కృష్ణారావు బజారులో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మార్కెట్ యార్డు డైరెక్టర్, సచివాలయ ఇన్‌చార్జులు, కన్వీనర్లు, వలంటీర్లు, స్థానిక వార్డు ప్రజలు హాజరు కావాలని కోరారు.

శివారాధన చేయడం పుణ్యఫలం

ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బ్రహ్మారెడ్డి



సత్రశాల(రెంటచింతల): శివకేశవులకు ఎంతో ప్రీతికరమైన కార్తీకమాసంలో శివారాధన చేయడం ఎంతో పుణ్య ఫలమని గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి అన్నారు. కార్తీకమాసం పురస్కరించుకుని ఆదివారం అనేక ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది భక్తులకు ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎంతో పురాతనమైన మల్లిఖార్జునస్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు ఎంతో మంది దాతలు ముందుకు వచ్చి కృషి చేయడం అభినందనీయమన్నారు. భక్తులు పవిత్ర కృష్ణా నదిలో కార్తీకస్నానం చేసి ప్రముఖ శైవక్షేత్రమైన సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు.

నిషేధిత మద్యం స్వాధీనం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని చెరువు కట్టబజారులోని ఓ గోడౌన్‌లో నిషేధిత తెలంగాణ మద్యాన్ని ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఆంజనేయులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు జి.నారాయణకు సంబంధించి గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించటంతో సుమారు రూ.23 వేలు విలువ గల తెలంగాణ మద్యం సీసాలను గుర్తించటం జరిగిందన్నారు. ఈ మద్యాన్ని స్వాధీనం చేసుకొని ప్రశాంత్, నారాయణను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

సీజ్ చేసిన వాహనాలకు రేపు వేలం

మాచవరం: మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో పలు అక్రమ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 21న ఉదయం 10 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ సమీర్ బాషా తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొమ్మిది ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలకు వేలం నిర్వహిస్తామని తెలిపారు. అధికారులు నిర్ణయించిన ధరల ప్రకారం వాహనాలు వేలం వేయడం జరుగుతుందని తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కావున ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని తెలియజేశారు.

సామాజిక ఉద్యమకారుడు రామగాని మృతి

పిడుగురాళ్ల: పట్టణానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు, పిడుగురాళ్ల పట్టణ గౌడ సంఘం మాజీ అధ్యక్షులు రామగాని పుల్లారావు (76) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. పీడీఎం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాసరావు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి జె.కృష్ణానాయక్, సీపీఎం పట్టణ కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు, నాయకులు యరగాని పున్నారావు, కొండలు, బాబురావు పలువురు రామగానికి నివాళులర్పించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



గురజాల : చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని వారి సేవలతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక చల్లగుండ్ల గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 650 మందికిపైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని వైద్యుడు జి.మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. 421 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 220 మందిని కంటి శుక్లాల శస్త్ర చికిత్సలకు రిఫర్ చేయడం జరిగిందన్నారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో వాగ్దేవి విద్యాసంస్థల విద్యార్థులు సేవలు అందించారు. వైద్యులు చల్లగుండ్ల శ్రీనివాస్, అక్కినపల్లి సైదులు, జానకీరామ్, టి.బుచ్చిబాబు, లక్ష్మయ్య, రామకృష్ణ, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



మాచవరంలోని గ్రంథాలయాన్ని సందర్శించిన డిప్యూటీ డైరెక్టర్ పీర్ అహమ్మద్ తదితరులు



దిశ చట్టంపై చర్చలో మాట్లాడుతున్న విద్యార్థిని



బాలికల వసతి గృహంలో మాట్లాడుతున్న న్యాయవాది మద్దాలి పద్మావతి

మాచవరం: గ్రంథాలయాలు విద్యా భాండాగారాలని ఏపీ పౌర గ్రంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ పీర్ అహమ్మద్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మండలంలోని మాచవరం, మోర్జంపాడు గ్రామాల్లోని గ్రంథాలయాలను ఆదివారం సందర్శించి, ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గ్రంథాలయాల రికార్డులను, వారోత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను పరిశీలించారు. పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సాంకేతికత అభివృద్ధి చెందినప్పటికీ గ్రంథాలయాలు పాఠకుల మన్ననలు పొందుతున్నాయని పేర్కొన్నారు. నాటి మహనీయుల చరిత్రలు, పాలకుల పాలనా దక్షతలను తెలుసుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కందుల ఝాన్సీలక్ష్మి, స్థానిక లైబ్రేరియన్ సుజాత తదితరులు ఉన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన ఉండాలి..

రెంటచింతల: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్క విద్యార్థిని మహిళా సాధికారతపై అవగాహన కలిగిఉండాలని ప్రముఖ న్యాయవాది కలివేల ప్రభుదాసు అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక రెంటచింతల శాఖ గ్రంథాలయంలో పలు పాఠశాల విద్యార్థులకు దిశ చట్టం, మహిళా సాధికారతపై డిబేట్ నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పోటీ పరీక్షలలో పాల్గొంటే వారిలో దాగిన ప్రతిభకు మెరుగులు దిద్దుకోవచ్చన్నారు. జ్ఞాపక శక్తిని కూడా పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రాయపాటి రాజకిశోర్, లూథరన్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

దిశ చట్టంపై అవగాహన అవసరం

పిడుగురాళ్ల: దిశ చట్టంపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని లాయర్ మద్దాలి పద్మావతి తెలిపారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఆదివారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లాయర్ పద్మావతి మాట్లాడుతూ మహిళా సాధికారత జరగాలంటే విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలిక వసతి గృహం ప్రిన్సిపల్ పి.మాధవి లత, గ్రంథాలయ అధికారి కె.రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరారామంలో భక్తుల సందడి



క్యూలైన్‌లలో భక్తులు

అమరావతి: ప్రఖ్యాత శైవ క్షేత్రం అమరావతిలో ఆదివారం తెల్లవారుజాము నుంచి పంచారామక్షేత్ర సందర్శకుల బస్సులతో అమరావతి మెయిన్‌రోడ్ నిండిపోయింది. తొలుత పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి భక్తులు ఆలయంలోని ఉసిరి చెట్టు వద్ద దీపారాధనలతో శివకేశవులకు పూజలు చేశారు. భక్తులు అమరేశ్వరునికి అభిషేకాలు, బాల చాముండేశ్వరీదేవికి కుంకుమార్చనలు నిర్వహించారు. ధ్యానబుద్ధ ప్రాజెక్టు, పాత, కొత్త మ్యూజియంలు, అమరేశ్వరాలయం, స్నానఘాట్‌లు యాత్రికులతో కళకళలాడాయి. కార్తీకమాస సందర్భంగా వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవాలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పట్టణ నూర్‌బాషాల సంఘం అధ్యక్షుడిగా ఖాశింసాహెబ్



నూతన కార్యవర్గ సభ్యులతో యూనియన్ అధ్యక్షుడు ఖాశింసాహెబ్

అమరావతి: అమరావతి పట్టణ నూర్‌బాషాల(దూదేకుల) సంఘ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ క్రమంలో అమరావతి పట్టణ నూర్‌బాషాల సంఘం గౌరవ అధ్యక్షుడిగా షేక్ వీరబాబు, అధ్యక్షుడిగా షేక్ ఖాశింసాహెబ్, ఉపాధ్యక్షుడిగా షేక్ చినఅల్లాబక్షు, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాన్‌సాహెబ్, కోశాధికారిగా షేక్ జాన్‌సైదా, సంయుక్త కార్యదర్శులుగా షేక్ మస్తాన్‌వలి, షేక్ మస్తాన్‌బాబు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా మహ్మద్ బాబి, షేక్ షాఖాశింమీరాలను ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను అమరావతి పట్టణ నూర్‌బాషాల(దూదేకుల) సంఘ సభ్యులు అభినందించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



కందులవారిపాలెంలో పుస్తకాలను ప్రదర్శిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

సత్తెనపల్లి: కార్తీకమాసం పురస్కరించుకొని త్రైత సిద్ధాంత భగవద్గీత పట్ల ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం బృగుబండ, కందులవారిపాలెం గ్రామాలలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్తీకమాసంలో దీపాలు వెలిగించడం, అందులోని జ్ఞానం గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు, సభ్యులు కె.అరుణ, కె.కోటేశ్వరరావు, కె.నారాయణమ్మ, కె.గోపి, డి.శ్రీను, ఎం.వీరయ్య, ఎం.వెంకటలక్ష్మి, సీహెచ్ అనురాధ, టి.రాఘవ, ఎం.అమర్, బి.చిరంజీవి, బి.శివ, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ఐదోరోజుకు చేరిన పెన్షనర్స్ అసోసియేషన్ ధర్నా



పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనం ఎదుట ధర్నా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు

సత్తెనపల్లి: పెన్షనర్స్ అసోసియేషన్ భవనం కింది గదులను లీజుకు తీసుకున్న పయనీరు ఆటోమొబైల్ నిర్వాహకుడు తక్షణమే ఖాళీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు రామారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనం ఎదుట పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా ఆదివారం ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీజ్ అగ్రిమెంట్ ముగిసినా, గదులు ఖాళీ చేయమని అడిగినప్పటికీ లీజుదారుడు తమ మొర ఆలకించటం లేదన్నారు. వెంటనే సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని గదులను ఖాళీ చేయించి అప్పగించాలని కోరారు. పెన్షనర్ అసోసియేషన్ చేపడుతున్న ధర్నాకు ముప్పాళ్ళ మాజీ ఎంపీపీ పచ్చల నాగేశ్వరరావు ఆదివారం మద్దతు ప్రకటించారు. ధర్నా శిబిరాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. పెన్షనర్స్ అసోసియేషన్ గదులను స్థానిక అధికారులు జోక్యం చేసుకొని ఖాళీ చేయించాలన్నారు. షాపు యజమానిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గదులను ఖాళీ చేసే వరకు ధర్నాలు కొనసాగించాలని పెన్షనర్లు అందరూ భావిస్తున్నారని, పోలీసులు తగిన శ్రద్ధ తీసుకొని ఖాళీ చేయించాలని కోరారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు రొంపిచర్ల పురుషోత్తం, డి.మల్లేశ్వరరావు, జక్కుల లక్ష్మీనారాయణ, కేబీఆర్‌జే ప్రసాద్, ఎంవీజే నాయుడు, జి.మురహరి, కె.రంగారెడ్డి, షేక్ నూర్ మొహిద్దిన్, షేక్ ఖాదర్‌వల్లి, మంచికంటి వెంకటేశ్వరరావు, షేక్ జైన్‌లాబ్దిన్, బి.నరసింహారావు, చంద్రయ్య, పి.ఆంజనేయులు, పి.ప్రభుదాస్, పొత్తూరి రామ కోటయ్య ఉన్నారు.

వనసమారాధనలతో ఆధ్యాత్మిక చింతన

జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట రూరల్: ఆధ్యాత్మిక చింతనతోపాటు ఆనందం, ఆరోగ్య సందేశాన్ని కార్తిక వనసమారాధనలు చాటి చెబుతాయని జిల్లా ఎస్పీ పి.రవిశంకర్‌రెడ్డి తెలిపారు. కుంకలగుంట వెల్ఫేర్ అసోసియేషన్ ఆధర్యంలో 14వ కార్తిక వనసమారాధనను ఆదివారం రావిపాడు రోడ్డులోని కృష్ణ చైతన్య కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఆత్మీయ అతిథులుగా పొడా వైస్ చైర్మన్ డాక్టర్ గజ్జల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ కృష్ణా జిల్లా మేనేజర్ డాక్టర్ అత్తలూరి శ్రీధర్‌లు హాజరయ్యారు. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో నివసిస్తున్న గ్రామానికి చెందిన వారు గత 14 సంవత్సరాలుగా కార్తిక వనసమారాధనలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా స్నేహభావం పెరుగుతుందని తెలిపారు. డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, కొల్లి బ్రహ్మయ్య, ఆతుకూరి వెంకటేశ్వర్లు, ఎస్‌కే సుభాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆటల పోటీల్లో పెద్ద, చిన్నా ఉత్సాహంగా పాల్గొన్నారు.

నేడు పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

సత్తెనపల్లి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు ఆదివారం తెలిపారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభిస్తారన్నారు. రైతులు, రైతు కూలీలు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు వైఎస్‌ఆర్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి ఉన్నారు.

నేడు బ్రాహ్మణపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

మాచవరం: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి , నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ జంగా కృష్ణమూర్తి పాల్గొంటారని తెలిపారు. కావున మండలంలోని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వడియరాజులపై అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదు

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య

పిడుగురాళ్ల: వడియరాజులపై శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షులు బీకే పార్థసారధి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, వడియరాజులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య, పిడుగురాళ్ల మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లాలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్థసారధి చేసిన వ్యాఖ్యలతో రాష్ట్రంలో వడియరాజులంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘ నాయకులు ఇర్లా గురుస్వామి, ఒర్సు శ్రీను, మల్లెల వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, బండారు రాజు, కుంచపు తిరపతయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, వల్లెపు కొండలు, బత్తుల కుటుంబరావు, చల్లా అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

మాచవరం: మండల కేంద్రం మాచవరంలోని జోసఫ్ ఏంజిల్ షేర్ అండ్ కేర్ వికలాంగుల వృద్ధుల ఆశ్రమానికి గుంటూరుకు చెందిన జూడిత్ మెర్సీ మేరీ సంస్థ తరపున లిటిల్ సిస్టర్స్ బృందం సభ్యులు ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వికలాంగుడైన ఆశ్రమ నిర్వాహకుని సేవలను అభినందించారు. సాయం అందించిన బృందానికి ఆశ్రమ నిర్వాహకుడు కోడూరి అజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

యడ్లపాడు: ఆత్మహత్యకు పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ ఆదివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. యడ్లపాడు మండలం సంగంగోపాలపురం గ్రామానికి చెందిన కాళహస్తి నాగప్రసన్న(24) అదే గ్రామానికి చెందిన ఏడుకొండలుతో కొద్ది కాలం కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దంపతుల మధ్య కుటుంబ కలహాలతో గొడవలు జరుగుతున్నాయి. భర్త వేధింపులతో మనస్తాపం చెందిన నాగప్రసన్న ఈనెల 14న ఇంట్లో ఎలుకల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి గుంటూరు సమగ్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి తల్లి దేవలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేద బ్రాహ్మణులకు నిత్యావసరాలు వితరణ

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని జీవీ మాధవరావు ఆఫీసులో నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు నాగరాజు రామరాజు, ప్రధాన కార్యదర్శి జి. వాసుదేవరావు, కార్యనిర్వహణ అధ్యక్షుడు ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, పసుపుల మురళీకృష్ణలు పాల్గొని నిత్యావసరాలు అందజేశారు. అప్పరాజు నాగేశ్వరరావు, దారా రామ్మూర్తి, మాదిరాజు నాగేశ్వరరావు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు...

వినుకొండ(నూజెండ్ల): సంకల్ప సేవాసమితి ఆధ్వర్యంలో వినుకొండ మండలంలోని విఠంరాజుపల్లి గ్రామంలో గల ఉషోదయ సెయింట్ ఆన్స్ బధిరుల పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ జానీబాషా (జిమ్‌జానీ), 2వ వార్డు కౌన్సిలర్ బత్తుల వీరమ్మ, సేవా సమితి గౌరవాధ్యక్షుడు గురజాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అందరి కలయిక ఆనందం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ జంగా



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల: ఆర్యవైశ్యులందరు ఒక చోట కలిసి కుటుంబ సభ్యుల్లాగా కలిసి మెలిసి ఉండటం ఎంతో ఆనందించదగ్గ విషయమని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తిలు అన్నారు. కార్తీక మాసం సందర్భంగా ఆర్యవైశ్యుల కార్తీక వన సమారాధన ఆదివారం పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...వైఎస్సార్‌సీపీపై ఆర్యవైశ్యుల అభిమానం వెలకట్టలేనిదని, వారి అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ముందుంటుందన్నారు. కుటుంబ సభ్యుల్లాగా అందరు కలిసిమెలిసి ఒకేచోట ఇలా భోజనం చేయటం ఎంతో ఆనందకరమన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు రకాల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను ఎమ్మెల్యే కాసు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు భవనాశి యల్లారావు, మద్దాళి శివ, జూలకంటి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య ప్రముఖులు, ఆర్యవైశ్య పెద్దలు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు నూతన వస్త్రాల పంపిణీ



దివ్యాంగులకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : మునగా రమాదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగులకు నూతన వస్త్రాలను ఎమ్మెల్యే కాసు చేతుల మీదుగా ఆదివారం దాచేపల్లిలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ...వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామంగా ఉన్న దాచేపల్లిని నగర పంచాయతీగా ఏర్పాటు చేశామని, మొట్టమొదటి చైర్‌పర్సన్‌గా మునగా రమాదేవికి అవకాశం కల్పించటం ద్వారా చరిత్రలో నిలిచేలా అభివృద్ధి చేశారని చెప్పారు. ప్రజల ఆకాంక్ష మేరకు నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేసి అభివృద్ధి పనులు చేశామని, రూ.2.50 కోట్లతో కొట్లా బజార్‌లో సిమెంట్ రోడ్డు, డ్రైనేజిలు నిర్మించామని, దాచేపల్లికే పెనుప్రమాదంగా మారిన కాటేరువాగును ఆధునికీకరణ చేశామని ఆయన తెలిపారు. రూ.16.50 కోట్ల వ్యయంతో ప్రతి ఇంటికి కృష్ణా జలాలు అందించే పనులు త్వరలోనే ప్రారంభిస్తామని, గ్రామంలో పూర్తిస్థాయిలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేలా కృషి చేస్తున్నామన్నారు. దాచేపల్లిలో ఇప్పటికే 2500 ఇంటి పట్టాలు ఇచ్చి ఇళ్ల మంజూరు చేశామని, జగనన్న కాలనీలు గ్రామాలుగా రూపాంతరం చెందుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ మాజీ చైర్మన్ మునగా పున్నారావు, యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్, నాగుబండి గురువులు, నాయకులు మునగా కొండలు, షేక్ దాడీ, మునగా వెంకీ, వేముల శ్రీహరి, యలమల సైదారెడ్డి, పల్లపు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు



దివ్యాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ చేస్తున్న టెక్నో పెయింట్స్ అధినేత ఆకూరి శ్రీనివాసరెడ్డి

దాచేపల్లి : టెక్నో పెయింట్స్ ద్వారా సమాజ సేవ కార్యక్రమాలు విస్తరిస్తామని టెక్నో పెయింట్స్ అధినేత, వైఎస్సార్‌సీపీ నేత ఆకూరి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని శ్రీనగర్ గ్రామంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. మండల పరిధిలో 12 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నో పెయింట్స్ ద్వారా మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. స్థానికుడిగా ఈ ప్రాంత ప్రజల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎనుముల మురళీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్లు కొప్పుల సాంబయ్య, పోలు వీరారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, సర్పంచ్ కూసం నాగిరెడ్డి, ఎంపీటీసీలు ఆకూరి కాశీరెడ్డి, ఆకూరి వెంకటరెడ్డి, అళ్ల రామకృష్ణారెడ్డి, నాయకులు ఉయ్యూరి రాంబాబు, వణుకూరి శంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఆకూరి వీరారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చెన్ను నాగిరెడ్డి, వంగా పద్మావతి పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి శాంతికళ్యాణం



అచ్చంపేట: మండలంలోని చామర్రు కృష్ణానది ఒడ్డున స్వయంభు వరసిద్ధి వినాయకుని దేవాలయంలో ఆదివారం చామర్రు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారికి శాంతికళ్యాణ మహోత్సవం కన్నుల పండువలా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మీయ బ్రాహ్మణ సమ్మేళనం, వనసమారాధన మహోత్సవం నిర్వహించారు. వరసిద్ధి వినాయకస్వామికి, అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామికి అభిషేకాలు, హోమాలు, ధాత్రీపూజ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులకు, మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అన్న సమారాధన అనంతరం బ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో బ్రహ్మణ సోదరులంతా ఐకమత్యంగా ఉండాలని శ్రీనివాసమూర్తి తెలిపారు.

వైఎస్సార్ సీపీతోనే ముస్లింల అభివృద్ధి

నాదెండ్ల: ముస్లిం మైనార్టీలకు చిరకాలం గుర్తుండే మహనీయుల్లో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ముందుండగా, ఆ తర్వాత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఉంటారని బాపట్ల జిల్లా వక్ఫ్‌బోర్డ్ కార్యదర్శి గద్దం మస్తాన్‌వలి చెప్పారు. గణపవరంలోని మసీదులో హర్ దిల్‌మే వైఎస్సార్... హమ్ సబ్ జగన్‌కే సాథ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముస్లిం మైనార్టీల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని చెప్పారు. ఈ నెల 17 నుంచి జిల్లాలోని అన్ని మసీదుల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం గణపవరం, చిరుమామిళ్ళ, నాదెండ్ల, గొరిజవోలు, చందవరం, సాతులూరు, అప్పాపురం, తూబాడు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, వక్ఫ్ బోర్డ్ వైస్ చైర్మన్ ఇమాం హుస్సేన్, నాదెండ్ల మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ జానీబాషా, కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, ఇమామ్‌లు అబ్దుల్‌రజాక్, షేక్ ఫకీర్‌వలి పాల్గొన్నారు.

మైనార్టీల పక్షపాతి సీఎం జగన్

యడ్లపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీల పక్షపాతి అని పల్నాడు జిల్లా ముస్లిం మైనార్టీ జోనల్ ఇన్‌చార్జి షేక్ ఇమామ్ హుస్సేన్ అన్నారు. 'హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్ కే సాథ్' కార్యక్రమం ఆదివారం యడ్లపాడు మండలంలో నిర్వహించారు. చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడు బేరింగ్ మౌలాలి, బాపట్ల వక్ఫ్‌బోర్డు కార్యదర్శి గద్దం మస్తాన్‌వలితో కలసి ఆయన యడ్లపాడు మండలాన్ని సందర్శించారు. ఆయా గ్రామాల్లోని మసీదు కమిటీ సభ్యులు, స్థానిక ముస్లింలతో సమావేశాలు నిర్వహించారు. ఇమామ్ హుస్సేన్ మాట్లాడుతూ హర్ దిల్‌మే వైఎస్సార్ కార్యక్రమం పలు ప్రాంతాల్లో నిత్యం చేస్తున్నామని ముస్లింల నుంచి ఆయా ప్రాంతాలలో విశేష స్పందన లభిస్తుందన్నారు. మైనార్టీ సబ్‌ప్లాన్ తీసుకువచ్చారని తెలిపారు. కౌన్సిలర్ బేరింగ్‌మౌలాలి మాట్లాడుతూ మసీదుల్లోని ఇమామ్‌ల గౌరవ వేతనాలను రూ.5వేల నుంచి రూ.10 వేలకు, మౌజన్‌లకు రూ.3వేల నుంచి రూ.5వేలకు పెంపుదల చేసిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు.